# అనుమాన్లు

**(జూన్ 2006, "ఆంధ్రప్రదేశ్ " మాసపత్రిక)**

ఆరోజు వొచ్చిన వారపత్రిక తిరగేస్తుంటే 'కవితల పోటీ' అన్న ప్రకటన కళ్ళబడింది వీరలక్ష్మికి. కళ్ళు పెద్దవి చేసి చూశాననుకుందిగానీ తన చిన్న చిన్న కళ్ళు పెద్దవి చేసినా నుదురు నెప్పెట్టాల్సిందే తప్ప రెండేళ్ళ వెధవ కూడా భయపడడని తెల్సు.

"ఇంత పిరికిదానివి.. నీకు... వీరలక్ష్మి అన్న పేరెవడు పెట్టాడే?" పెళ్ళయిన కొత్తల్లో భర్త హనుమాన్లు అడిగిన ప్రశ్నకి మూతి మూరెడు సాగదీసి ముప్ఫయ్ వంకర్లు తిప్పింది.

"ఎవడు కాదు.... ఎవత్తి?..."

"ఇంత పిరికిదానివి.. నీకు... వీరలక్ష్మి అన్న పేరెవత్తి పెట్టిందే?"

"మీరసలు మనిషేనా?"

"ఎంత మాటన్నావ్! జాగర్తగా మాటాడు..."

"లేకపోతే ఏవిటీ? మా బామ్మని 'ఎవత్తి' అంటారా మీరు"

"నీకేవన్నా స్క్రూ లూజా?"

"అదిగో అదుగో.. జాగర్తగా మాటాడమని నన్ను బెదిరించారు... మీరు మాటాడేది బావుందా."

"బెదిరించానా? అమ్మో! అమ్మో! ఎంత మాటపడితే అంత మాటనేస్తున్నావే! నీకసలు ఎలా మాటాడాలో తెలియదు"

"మీకు తెల్సులెండి మహా.. పెద్దావిడని మా బామ్మని పట్టుకుని ఎవత్తి అంటారా?"

"అందుకే స్క్యూలూజా అనడిగాను ఎవడు కాదు... ఎవత్తి అనండి అని నువ్వే కదా చెప్పావు..."

"చాల్లెండి... నా ఉద్దేశం మీరర్థం చేసుకుంటే దేశాలే బాగుపడేవి. ఎవడు అని మీరంటే... మొగాళ్ళు కాదు అడవాళ్ళని మీకు చెప్పడం కోసం ఎవడు కాదు ఎవత్తి అన్నాను..."

"నీ ఉద్దేశం నేను... నా ఉద్దేశం నువ్వు అర్థం చేసుకున్నంత మాత్రాన దేశాలు బాగుపడిపోతాయా నీకు పిచ్చికాకపోతే..." దీర్ఘం తీశాడు.

"నాకు పిచ్చా? ఔనౌను... పడేసెయ్యండి ఏ పిచ్చాసుపత్రిలోనో నన్ను.. ఎన్ని టీ.వీ. సీరియల్సులోనూ, ఎన్ని సినిమాల్లోనూ చూడలేదూ... బావున్నదాన్ని తీసికెళ్ళి పిచ్చాసుపత్రిలో పడెయ్యడం...."

'ఓర్నాయనోయ్! ఆ సినిమాలేవిటో... ఆ సీరియల్సేవిటోగానీ.. ముందు నా పని సీరియల్ అయిపోతుంది. నేరకపోయి అన్నాను నీకీ పేరెవరు పెట్టారని.. ఎరక్కపోయి ఇరుక్కుపోయాను... నీకసలు వీరలక్ష్మి కాదు బోర్ లక్ష్మి అని పేరు పెట్టుండాల్సింది...' తనలో తనే అనుకుంటూ అక్కడి నించి వెళ్ళిపోయాడు.

★ ★ ★

'కవితల పోటీ' మళ్ళీ మళ్ళీ ఆ ప్రకటన చదివింది వీరలక్ష్మి

కథలు రాయడం ఎలాగో చేతకాదు తనకి.. కనీసం ఓ కవిత ముక్కయినా రాసే ప్రయత్నం చెయ్యకపోతే ఎందుకీ కలికాలబ్బతుకు?... పెద్ద వయసాయన.. నారాయణరెడ్డి గారు ఇప్పటికీ కవితలు రాస్తున్నప్పుడు. ఆయన వయసులో సగం వయసు కూడా లేని తను. ఉడుకు రక్తం ఉప్పొంగుతున్న తను మాత్రం కవిత రాయలేదా? ఏమైనా సరే కవిత రాయాలి.. అది కూడా మొదటి కవితే పోటీకి పంపడం.. బహుమతి గెల్చుకోవడం జరిగిపోవాలి.. ఇదే నా మంగమ్మ శపథం... పత్రికలో అచ్చయ్యేదాకా ఆయనగారికి తెలియకుండా జాగ్రత్తపడాలి....

లేకపోతే ఎల్లకాలం వేళాకోళం చేసినా చేస్తారు.

మళ్ళీ ప్రకటన చూసింది... ఈ సారి ఇందాక కనపడని రెండక్షరాలు పొందికగా కనిపించాయి కింద.. 'ప్రేమ' కవితల పోటీ.. ప్రేమ మీద రాయాలిట... సరే... అదెంత పని.. రాసేయచ్చు...

★ ★ ★

రాత్రి పదకొండైంది. తొందరగా పడుకునే అలవాటు ఇద్దరికీ కూడా... గుర్రుపెట్టి నిద్రపోతున్న ఆయనగారికి మెలుకువ కలగకుండా మెల్లగా లేచి చప్పుడు కాకుండా పక్కగదిలోకొచ్చింది. ముందే రెడీ చేసి పెట్టుకున్న తెల్లకాగితాలు, పెన్నూ తీసుకుని కిటికీకి దగ్గరగా కుర్చీ జరుపుకుని కూచుంది, వారపత్రిక మీద తెల్లకాగితం పెట్టుకుని.. పెన్ను చెంపకి చేర్చి ఆరితేరిన కవయిత్రిలా పోజు మటుకు పెట్టింది.. ఆలోచన్లు మటుకు ఎంత సేపైనా ఆవలింతలు దాటి రానంటున్నాయి.

ప్చ్... ఏవిటో.. పెళ్ళికి ముందు ప్రేమించక పోవడం ఎంత పెద్ద పొరపాటో ఇప్పుడు తెలిసొస్తోంది. కదా!... పక్కింట్లో రాజు అనే కుర్రాడుండేవాడు. ఎప్పుడూ అదోలా చూసేవాడు... ఆ గుడ్లు ఎవరేనా పీకేస్తే బావుండనుకునేది ఒళ్ళు మండుకొచ్చి.. అన్నన్నన్నన్నన్న.. అదోలా చూసినా ఇదోలా చూసినా.. పెళ్ళి సంబంధం కుదిరే దాకా వాడిని ప్రేమించేసినా పోయేది... ఇప్పుడీ కవిత రాయడానిక్కాస్త ఉపయోగపడేదేమో!..

"వీరలక్ష్మీ.... వీరలక్ష్మీ.. ఏవిటి పడుకో లేదూ... ఇంతరాత్రి వేళ ఏం చేస్తున్నావ్?"

'బాబోయ్! ఇక్కడ తను ప్రేమతో కుస్తీ పడుతుంటే.. ఆయనక్కడ దోమల్తో కుస్తీపట్టలేక లేచి కూచునుంటారు...' గబగబా కాగితాలూ, పెన్నూ చీరల అరలో దాచి పెట్టేసి ఇవతలి కొచ్చింది.

"ఎప్పుడు లేచెళ్ళావు? ఎందుకు లేచెళ్ళావు?"

"మీకన్నీ విడ్డూరాలే..."

"విడ్డూరాలూ లేవు.. బూందీలడ్డూలూ లేవు... బాత్‌రూమ్ కెళ్ళి ఇంక అక్కడే నిద్రపోతున్నావా?"

"మీరూ మీ అనుమానాలూ.. తెల్లారిలేస్తే నా మీద ప్రతి దానికీ అనుమాన పడుతూనే ఉంటారు.. మీ వాళ్ళు హనుమాన్లు అని కాదు "అనుమాన్లు" అని పెట్టుండా ల్సింది పేరు.. ఏం చెయ్యమంటారు? వొస్తున్నట్టుగా ఉంటుంది ఎంతకీ రాదు... అందుకే అంతసేపు కూచోవలసొచ్చింది..."

"వొచ్చిందా లేదా ఇంతకీ?"

"వొచ్చి చస్తేగా? మళ్ళీ రేపూ ట్రైచేస్తా"

నాలిక్కొరుక్కుంది వీరలక్ష్మి కవిత గురించి తను మాటాడితే ఇంకోలా అర్థం చేసుకున్నారు. పోన్లే... ఇంకా నయం పూర్తిగా నోరు జారలేదు తను.

★ ★ ★

మర్నాడు మళ్ళీ చడీచప్పుడు కాకుండా లేచి పక్కగదిలో కెళ్ళి కవితారాణిలా కుర్చీలో కూచుంది దర్జాగా. పల్లెటూరివాడు కాళిదాసు అమ్మవారి గుళ్ళో... హఠాత్తుగా వొచ్చిన సునామీలా మాణిక్యవీణాం అంటూ ఎంత గొప్పగా శ్లోకం చెప్పాడు 'కాళిదాసు సినిమాలో' ఇప్పుడు తను కూడా అమ్మవార్ని తల్చుకుంటే తనకి తెలియకుండానే తన కలంలోంచి కవితా జల్లులు జాలువారుతాయేమో!.. అబ్బో! అమ్మవారు అనుకోగానే అప్పుడే జాలువారుతాయేమో అన్న అందమైన పదం తన మనసులో జలతరంగిణిలా మోగింది కదా! ఆనందంతో పులకించి పోయింది చెయ్యి. పులకిస్తే ఒళ్ళంతా పులకించాలిగానీ ఈ చెయ్యి ఒక్కటే పులకిస్తోందేవిటి చెప్మా...

ఎడం చేతి జబ్బమీద చూసుకుంది జాకెట్ మీంచి నైట్‌క్వీన్ కుడుతోంది అది పులకింతకాదనీ.. కుట్టింత అనీ అర్థమై ఒక్క చరుపు చరిచింది. జబ్బమీద దెబ్బమాత్రం మిగిలింది.. దోమ ఎగిరి పోయింది... పట్టువదలని విక్కమార్కిలా మళ్ళీ వొస్తుంది మళ్ళీ కుడుతుంది... మళ్ళీ వొస్తుంది, మళ్ళీ కుడుతుంది... క్రిమికీటకాలకున్న పట్టుదల మనిషికి లేకపోతే ఎలా? రాయాలి రాయాలి.... ఎలా?.. ఎలా?... 'ఓ ప్రేమికుడా' ఆ అక్షరాలు కాగిత మ్మీద పెట్టి కావ్యం రాసినంత పొంగిపోయింది. 'ఓ ప్రేమికుడా' పదే పదే ఆ మాట అనుకుంటూ కిటికీలోంచి బయటికి చూసింది. పక్కిల్లు కనపడింది. తన్ను కొచ్చింది తర్వాతి మాట 'పక్కింటి ప్రేమికుడా' వహ్వా వహ్వా తన కవిత్వానికి తనే మురిసిపోతూజబ్బ చరుచుకుంది

ఈ సారి దోమ కాలి మీద కుడుతున్నా కూడా – 'ఓ ప్రేమికుడా పక్కింటి ప్రేమికుడా పదపోదాం పద పోదాం ప్రేమించుకుందాం పెడదారి పడదాం' అయ్యబాబోయ్! ఇంత కవిత్వం వొచ్చేసిందే! తనకి కవితల పోటీలో బహుమతి గ్యారంటీ.

"వీరలక్ష్మి ! వీరలక్ష్మి !"

'అమ్మ బాబోయ్! లేచారు.. వివాహం విద్య నాశాయ అన్నారు గానీ... అసలు వివాహం 'కవిత నాశాయ అనాలి' గబగబా కాగితాలు, పెన్నూ దాస్తుంటే గుమ్మంలోకి రానేవొచ్చాడు హనుమాన్లు. ఏదో దాయడం చూడనే చూశాడు. ఏవిటి దాస్తున్నావని అడగబోయి మానేశాడు.

అదేదో రాజకోటం రహస్యంలా...రత్నగిరి రహస్యంలా తనే ఛేదించాలని భీష్మ శపథం చేసుకున్నాడు. మనసులో పైకి మాత్రం పరమ ప్రేమగా అడిగాడు "నిశాచర లక్ష్మీ పడుకోవా?"

"అయ్యోరామా! ఎందుకు పడుకోనూ? నేనేవన్నా అమృతం తాగానా?"

"అందుకే అయోమయం లక్ష్మి అంటాను... అమృతం తాగితే ఆకలెయ్య దుగానీ నిద్రెందుకు రాదూ?"

"ఏమో! ఆ తాగినాడెవడన్నా చెప్తే తప్ప మనకేం తెలుస్తుందీ?"

"మరీ అలా తాగినాడంటే ఎలాగో ఉంది వినడానికి..."

"వినడానికే బాధగా ఉందే మీకు?... మరి... ఆ రోజు స్నేహితుడెవరో పుచ్చుకోమంటే పుచ్చేసుకుని తూలుకుంటూ ఇంటి కొస్తే.. చూట్టానికి నాకెలా ఉంటుంది?...."

అర్థరాత్రి మద్దెలదరువంటే ఇదేనేమో! ఇంక ఇక్కడ నుంచోడం తనకే మాత్రం సేఫ్టీకాదు... వెళ్ళిపోయాడు పడగ్గదిలోకి....

★ ★ ★

మర్నాడు అదివారం.. కూరగాయల సంత... ఎదురింటావిడతో కల్సి కూర్లలక్ష్మిలా శ్రీమతి వెళ్ళగానే వీధి తలుపు గడియేసి విజృంభించాడు చీరల అరమీద. కనపడనే కనపడింది కాగితం. జాగ్రాత్తగా మడత విప్పాడు. చదివాడు...

‘ఓ ప్రేమికుడా”...

ఓసినీ... పళ్ళు నూరుకున్నాడు.

‘పక్కింటి ప్రేమికుడా’

ఓరినీ... పిడికిళ్ళు బిగించాడు.

‘పదపోదాం పదపోదాం ప్రేమించుకుందాం పెదదారి పడదాం’

ఓరి నాయనోయ్! అయ్యింది... అనుకున్నంతా అయ్యింది.. పక్కింటి బ్రహ్మచార్ని ఇది ఆ రోజు అదోలా చూసినప్పుడే బీజం మొలకెత్తింది. తనలో ఇదుగో ఇప్పుడు రూఢీ అయిపోయింది. రోజూ రాత్రిళ్ళు కూచుని వాడికి ప్రేమలేఖలు రాస్తోందన్నమాట. ఎవ్వర్నీ నమ్మడానికి లేవు రోజులు. తనంటే ఆవిడగారి కిష్టంలేదన్న మాటేగా! ఎంత మోసపోయాడు తను! ఆడదాన్ని నమ్మమని ఎవడు చెప్పాడసలు? ఛ....ఛ.... చెప్తా చెప్తా దీని పని చెప్తా....

★ ★ ★

ఆ రోజుపొద్దున్నే ఓ చిన్న చేతిసంచితో గుమ్మంలో అడుగుపెట్టిన తండ్రిని చూస్తూనే ఆశ్చర్యంగానూ, సంబరంగానూ అంది వీరలక్ష్మి “ఏవిటి నాన్నోయ్! కబురూ కాకరకాయ లేకుండానే...”

“కాకరకాయిలేదు గానీ కబురుందమ్మా.. మీ ఆయన కబురు చేస్తేనే రాత్రి బస్సెక్కాను... ఎందుకో మరి అర్జంటుగా రమ్మన్నాడు.”

“ఔనండీ అర్జంటే” గదిలోంచి ఇవతలికొచ్చాడు హనుమాన్లు.

“మీ అమ్మాయి ఉండవల్సిందిక్కడ కాదు.. పక్కింట్లో... ఆ మాట మీతో చెప్పి మీ చేత్తో మీరు మీ అమ్మాయిని పక్కింట్లో అప్పు చెప్పి వెళ్తారని రమ్మన్నాను”

హఠాత్తుగా ఏమైందబ్బా ఈయనకి? గాలేమన్నాసోకిందా?... చిన్న చిన్న కళ్ళని పెద్దవి చెయ్యలేక నోరు పెద్దగా తెరుచుకుని భర్తవంక చూసింది వీరలక్ష్మి

“ఏవిటల్లుడూ... ఏవిటినువ్వనేది?”

“ఉపోద్ఘాతం లేకుండా చెప్పేస్తాను... మీ అమ్మాయీ పక్కింటి బ్రహ్మచారీ ప్రేమించుకున్నారు”

"ఎంత మాటన్నారురూ? అసలు మీకు నోరెలా వొచ్చిందండీ అలా మాటాడ్డానికి?" నెత్తిమీది కుండకి చిల్లుపడింది. తెగసీరియల్స్ చూసిన అనుభవం ఏమో చిటికెలో ఊపందుకుని బాగానే జాలిగొలిపేలా ఏడుస్తోంది వీరలక్ష్మి.

"ఊరుకోమ్మా వెర్రిలక్ష్మీ" కూతుర్ని ఓదారుస్తూ పైకండువాతో తన పొడికళ్ళు తుడుచుకున్నాడు తండ్రి.

"కావాలంటే బుజువు చూపిస్తాను"విసురుగా గదిలో కెళ్ళి మళ్ళీ అంత విసురుగాను బయటికొచ్చి చేతిలో కాగితం మావగారి కందించాడు హనుమాన్లు

"ఓ ప్రేమికుడా పక్కింటి ప్రేమికుడా...

"నాన్నోయ్ నాన్నోయ్! నా కవిత నా కవిత.. చదవకు" చటుక్కున ఏడుపాపి, లటుక్కున కాగితం లాక్కుంది కవితాలక్ష్మి".

"కవితేవిటీ?" వింతగా చూశాడు హనుమాన్లు. సిగ్గుతో మెలికలు తిరిగిపోతూ అసలు విషయం చెప్పింది. తనమీద అనుమానం పడ్డ భర్తని సీతామాలక్ష్మిలా చూసింది.

పకపకా నవ్వాడు మావగారు "అదన్నమాట అసలు సంగతి అనుమాన్లూ!"

అసలు సిసలు ధైర్యలక్ష్మిలా కొంగు బొడ్లో దోపుకుని ఓరగా ఓ చూపు విసిరింది వీరలక్ష్మి.

'మరీ జ్యోతిలక్ష్మిలా అలా చూస్తుందేవిటి?" మళ్ళీ పెనుభూతం ఆవహించ బోతుంటే – 'నా పేరు నిజంగానే అనుమాన్లా?' అన్న అనుమానం వొచ్చింది హనుమాన్లకి.

★★ ★★ ★★